

తన పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రగతిభవన్‌లో సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న బీఆర్‌ఎస్ ఎల్బీ కార్యదర్శి ఎం. రమేశ్‌రెడ్డి







## విజయ దశమి శుభాకాంక్షలు

దసరా పండుగ సందర్భంగా ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ కే. కేశవరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



నేరేడ్‌మెట్ డివిజన్‌లో మంగళవారం పూలతో అలంకరించిన ఓ నాయకుడి ద్విచక్రవాహనంపై ప్రచారం చేస్తున్న మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

*- నేరేడ్‌మెట్, అక్టోబర్ 24*



ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ సీనియర్ నాయకుడు బొక్క సదానంద్‌రెడ్డి

# ఎల్బీ నగర్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలి

**మంత్రి కేటీఆర్**

ఎల్బీనగర్, అక్టోబర్ 24: ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట డివిజన్‌కు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు బొక్క సదానంద్‌రెడ్డితో పాటు యువకులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన బొక్క సదానందరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితుడనై బీఆర్‌ఎస్‌లో చేరానన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎల్బీనగర్‌లో బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కార్తిక్‌రెడ్డి, ముద్ద పవన్‌తో పాటుగా పార్టీలో చేరిన వారిలో చందు,మనీశ్, హకీం, అంజి తదితరులు పాల్గొన్నారు.

# వాట్సాప్ వేదికగా..

**కాలనీ, బూత్‌ల వారీగా ప్రత్యేక గ్రూప్‌లు**

**ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ జోరు**

సిటీబ్యూరో, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ) : ఎన్నికల ప్రచారం తీరు మారుతోంది. సాంప్రదాయక ప్రచారాలకు తోడుగా కొత్తగా టెక్నాలజీ ఆధారిత ప్రచారానికి పార్టీలు తెరలేపాయి. ఇప్పటికే సోషల్ మీడియా మాధ్యమాల్లో బీఆర్‌ఎస్ దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా పార్టీ ప్రచార కార్యక్రమాలను నేరుగా ఓటరుకు చేర్చేలా సరికొత్త ప్రణాళికలతో దూసుకుపోతున్నారు. అందరికీ అందుబాటులో ఉండే సోషల్ మీడియా యాప్ వాట్సాప్‌ను వేదికగా చేసుకుని క్షేత్రస్థాయికి తీసుకెళ్తున్నారు. యూజర్ టూ ఓటర్ కాన్సెప్ట్‌తో బీఆర్‌ఎస్ ప్రణాళికను అమలు చేస్తుండగా... ప్రత్యేక గ్రూపులతో హైదరాబాద్ నగరంలో జరిగిన అభివృద్ధిపై జనాలను చేరవేస్తున్నారు. ఇందుకు బూత్‌ల వారీగా, కాలనీల వారీగా ప్రత్యేక గ్రూప్‌లు, చానళ్లను క్రియేట్ చేసుకుని స్థానికంగా ఉండే యూజర్లలో విషయ పరిజ్ఞానాన్ని పెంచుతున్నారు. ప్రస్తుతం వినూత్నమైన రీతిలో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే కాలనీ సంఘాలు, అపార్టుమెంట్ గ్రూపులతోపాటు, తాజాగా బూత్‌ల వారీగా ఓటర్లను ఆకట్టుకునేలా చేపట్టిన తాజా ప్రచారం తీరు జనాల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఎక్స్(ట్విట్టర్), ఫేస్‌బుక్‌లో వచ్చే బీఆర్‌ఎస్ కార్యక్రమాలను నేరుగా వీక్షించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండగా... ఎలాంటి ఆర్భాటం లేకుండా నేరుగా ఓటరైన యూజర్‌కు పార్టీ కార్యక్రమాలను తీసుకెళ్లడంలో సమర్ధవంతంగా పనిచేస్తుందని పార్టీ నేతలు చెబుతున్నారు.

# ఎలక్ట్రానిక్ హబ్ @కొంగరకలాన్..

**ఫాక్స్‌కాన్ తరహాలో కేన్స్ సెమికాన్.. - రూ.3000కోట్లతో స్థాపించనున్న పరిశ్రమ.. - త్వరలో ఎలిమినేడులో మరో ఎలక్ట్రానిక్ పరిశ్రమ..**




ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ చౌహాన్

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 24 : రంగారెడ్డిజిల్లా కొంగరకలాన్ భవిష్యత్‌లో ఎలక్ట్రానిక్ హబ్‌గా మారనున్నది. కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ సమీపంలో ఇప్పటికే చైనాకు చెందిన ప్రతినిధులు రూ.4,634కోట్లతో ఫాక్స్‌కాన్ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో పరిశ్రమల పనులు చకచకా సాగుతున్నాయి. 2024 మేలో ఉత్పత్తులు ప్రారంభించాలనే పట్టుదలతో పనులు చేపడుతున్నారు. ఈ పరిశ్రమకు అతిసమీపంలోనే బెంగుళూరుకు చెందిన పారిశ్రామిక వేత్తలు కేన్స్ సెమికాన్ అనే మరో ఎలక్ట్రానిక్ సంస్థను ప్రారంభించారు. సుమారు రూ.3000కోట్ల పెట్టుబడులతో ఈ పరిశ్రమ ఏర్పాటుకు టీఎస్ఐఐసీ ఎండీ వెంకటనర్సింహారెడ్డి, రాచకొండ పోలీసు కమిషనర్ దేవేంద్రచౌహాన్ కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. దీంతో కొంగరకలాన్‌లో రెండు ప్రముఖ ఎలక్ట్రానిక్ పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. ఫాక్స్‌కాన్ కంపెనీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మంది ఉపాధి పొందే అవకాశాలుండగా...కేన్స్ సెమికాన్‌లో వెయ్యి మంది వరకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అలాగే, త్వరలోనే ఎలిమినేడు గ్రామంలో కూడా మరో ఎలక్ట్రానిక్ కంపెనీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సంస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే టీఎస్ఐఐసీ ద్వారా భూసేకరణ చేపట్టింది. త్వరలోనే ఎలిమినేడులో కూడా మరో ఎలక్ట్రానిక్ సంస్థ ఏర్పాటు కానుంది. కేన్స్ సెమికాన్ పరిశ్రమలో అనేక రకాల ఎలక్ట్రానిక్ వస్తువుల పరికరాలను తయారుచేయనున్నారు.

ఎలక్ట్రానిక్ రంగం కొతపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో ఆయా పరికరాలకు ఉపయోగించే అతి ముఖ్యమైన పరికరాలను ఇక్కడ తయారుచేయనున్నారు. ఫాక్స్‌కాన్‌లో సెల్‌ఫోన్లు తయారుచేయనుండగా...కేన్స్ సెమికాన్‌లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లతో పాటు మరికొన్ని ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉపయోగించే అతిముఖ్యమైన సెమీ కండక్టర్స్‌ను ఇందులో తయారుచేయనున్నారు. దీంతో ఈ ప్రాంతంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు త్వరలో ప్రారంభం కానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే పెట్టుబడిదారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుండటంతో ఇతర దేశాలకు చెందిన పెట్టుబడిదారులు కూడా కొంగరకలాన్ సమీపంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు టీఎస్ఐపాస్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నవారికి వారం రోజుల్లో అనుమతులు జారీ చేస్తున్నారు. అలాగే, పెట్టుబడిదారులకు భూమి, విద్యుత్, నీరు వంటి ముఖ్యమైన సదుపాయాలను కూడా ప్రభుత్వమే కల్పిస్తున్నది. అలాగే, పెట్టుబడిదారులు దర్జాగా తమ వ్యాపారాలు జరుపుకోవటం కోసం అవసరమైన భద్రతను కూడా తెలంగాణ పోలీసులు కల్పిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి మరికొంతమంది పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చే అవకాశాలున్నట్లు తెలిసింది.

# ఐటీ కారిడార్‌లో పోటీకి భయం

- అయోమయంలో ప్రతిపక్ష పార్టీలు
- అభ్యర్థులను ప్రకటించలేక సతమతం
- కొత్త వారొస్తారేమోనని ఆశావహుల ఆందోళన





సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : అధికార పార్టీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకువెళుతుంటే... ప్రతిపక్ష పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న ఆశావహుల్లో అయోమయం నెలకొంది. తాజాగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే... ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న వారిని కాదని... కొత్త వారికి టికెట్లు ఖరారు చేస్తుండడంతో ఆశావహులు కంగుతింటున్నారు. ఐటీ కారిడార్‌లో అత్యంత కీలకమైన అసెంబ్లీ నియోజకవర్గాలుగా పేరున్న శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌లలో ఇప్పటికీ పోటీ చేసే అభ్యర్థులు ఎవరో ఆయా పార్టీలు ప్రకటించలేదు. కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటికే మొదటి లిస్టును ప్రకటించినా... అందులో ఈ రెండు నియోజకవర్గాల నుంచి అభ్యర్థులను ప్రకటించకపోవడం ఆశావహులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఎన్నో ఏళ్ల నుంచి పార్టీలో ఉంటూ ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న ఆశతో ఎదురు చూస్తున్న వారు నిరాశతో ఉన్నారు. దీనికి కారణం... ఇటీవల కాలంలో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఏకంగా టికెట్లు కేటాయిస్తుండడమే. మల్కాజిగిరి ఎమెల్యేకు కాంగ్రెస్ పార్టీలో ఒకేసారి రెండు టికెట్లను కేటాయించడాన్ని స్థానిక నాయకులు ఊహించుకొని ఆందోళనకు గురవుతున్న పరిస్థితి ఈ రెండు నియోజకవర్గాల్లో నెలకొంది. మరోవైపు ఒక్కో నియోజకవర్గంలో 3 నుంచి 5 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిని కాదని కొత్తగా నాయకులు పార్టీలోకి వచ్చే అవకాశాలు ఉండడంతో టికెట్ దక్కుతుందో లేదోనన్న భయం వారిని వెంటాడుతోంది.

### అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గాలు...

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఐటీ కారిడార్‌లో అత్యంత కీలకమైనవే కాకుండా అత్యధిక ఓటర్లు ఉన్న నియోజక వర్గాలుగా గుర్తింపు పొందాయి. మెజారిటీ ఓటర్లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సెటిల్ అయిన వారు ఉండగా, ఇందులో ఐటీ ఉద్యోగులు, ఉత్తర భారత దేశానికి చెందిన వారు చాలా మందే ఉన్నారు. ఇలాంటి చోట ఓటర్ల ఆలోచన ఎలా ఉంటుందో తెలియక ప్రతిపక్ష పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న వారు సతమతమవుతున్నారు. అదేసమయంలో శేరిలింగంపల్లి నుంచి అధికార పార్టీ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా, సిట్టింగ్ ఎమ్మెల్యే అరికెపూడిగాంధీ, రాజేంద్రనగర్ నుంచి ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌లు ఐటీ కారిడార్‌లో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెబుతూ ప్రజల్లో తిరుగుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులే ప్రత్యర్థి పార్టీలకు అందనంత వేగంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరవుతూ ఉంటే... కాంగ్రెస్, బీజేపీల నుంచి అభ్యర్థులెవరో తెలియని ఆయా పార్టీల క్యాడర్‌లో నెలకొంది.

### అభివృద్ధి అంటేనే ఐటీ కారిడార్...

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ కేంద్రంగా జరిగిన అభివృద్ధిని చూస్తే అత్యధికంగా ఐటీ కారిడార్ పరిధిలోనే జరిగింది. ఈవిషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారు. కొత్తగా వందలాది ఐటీ కంపెనీలతో పాటు ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, లింకురోడ్లు, తాగునీరు, విద్యుత్... ఇలా ఎన్నో అంశాల్లో అభివృద్ధి ఐటీ కారిడార్ ఎక్కువ జరగడంతో అధికార పార్టీపై ప్రజల్లో ఎంతో సానుకూలత ఉంది. అలాంటి చోట తమ భవిష్యత్ ఎలా ఉంటుందో అన్న ఆలోచన ఒకవైపు ఉంటే... టికెట్ ఎప్పుడు ఎవరికి ఇస్తారో అన్న దానిపైనే ఎక్కువగా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల గడువు సమీపిస్తున్నా టికెట్లు ఖరారు కాకపోవడం ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు ప్రతికూలంగా మారతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ఖరారైన తర్వాత ప్రజల వద్దకు వెళ్లేందుకు సరిపడా సమయం లేకపోతే గెలుపు అంత సులువు కాదనే అభిప్రాయం ఆయా పార్టీల నాయకుల నుంచే వ్యక్తమవుతోంది.

# ఇంటింటికీ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో

**జిల్లాలో మరింత వేగంగా ప్రచారం**

మేడ్చల్, అక్టోబర్24 (నమస్తే తెలంగాణ) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బీఆర్‌ఎస్ ప్రచారం మరింత వేగం పెంచేలా బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రణాళికను సిద్ధం చేశారు. బుధవారం నుంచి ఇంటింటికీ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో వెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో ఇప్పటికే మంత్రి మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతుగా కాంగ్రెస్, బీజేపీల నుంచి జోరుగా వలసలు కొనసాగుతున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు చేస్తున్న ప్రచారానికి కూడా విశేష స్పందన లభిస్తున్నది.

ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టో పథకాల హామీలను ఇంటింటికీ ప్రచారం చేసేలా ప్రణాళికను రూపొందించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నేరవేర్చడంతో పాటు అదనంగా మరిన్ని పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన వారందరికీ అందజేశారు. కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా, అన్నపూర్ణ పథకం, ఆసరా పెన్షన్ 5,016, దివ్యాంగులకు 6 వేల పెన్షన్ పెంపు, రైతుబంధు 16 వేలు, అగ్రవర్ణ పేదలకు గురుకులాలు, కేసీఆర్ ఆరోగ్యరక్షకు రూ. 15 లక్షలు, సౌభాగ్యలక్ష్మి రూ. 3 వేలు మహిళలకు జీవనభృతి, గ్యాస్ సిలిండర్ రూ. 4వందలకే, మహిళ సమాఖ్యలకు సొంత భవనాలు, హైదరాబాద్‌లో మరో లక్ష డబుల్ బెడ్‌రూమ్‌లను అందించే హామీలను ఇంటింటికీ ప్రచారం చేసి వివరించనున్నారు. దీనికి సంబంధించి మ్యానిఫెస్టోలను కరపత్రాలను ఇంటింటికీ అందజేయనున్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో బీఆర్‌ఎస్ చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు